నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, గురువారం 17 ఏప్రిల్ 2025 KARIMNAGAR

## తప్పుడు హామీలపై నిలదీయాలి

కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగింది. అబద్ధపు హామీలతో మోసపూరితంగా కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది. ప్రజలను అరిగోస పెడుతున్నది. ఆ పార్టీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పదేండ్లు వెనక్కి పోయింది. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారు. కానీ, కాంగ్రెస్



మాటలు విని ఇప్పుడు ప్రజలు గోసపడు తున్నారన్నారు. కేసీఆర్ పాలనే తెలంగా ణకు శ్రీరామరక్ష. కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు హామీలపై గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిలదీయాలి. కొన్ని చోట్ల బీఆర్ ఎస్ కార్యకర్తలు సోషల్ మీడియాల్లో కాంగ్రెస్ పార్టీ హామీలు, మోసాలపై పోస్టులు పెడితే పోలీసులు కేసులు పెడు తున్నారు. తప్పుడు కేసులు పెట్టిన సమ యంలో కార్యకర్తలు, నాయకులు సమష్టి ప్రభుత్వంపై ఉద్యమించాలి. పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదు. కార్యకర్తల నుంచే నాయకులు పుట్టుకొస్తారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలి. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే.

**- కొప్పుల ఈశ్వర్, మాజీమంత్రి**

## గులాబీ జెండా ఎగురవేసి తీరుతాం


తప్పుడు హామీలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారు. కాంగ్రెస్, బీజేపీని విశ్వసించే పరిస్థితి లేదు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వే. భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలిచి తీరుతుంది. గులాబీ జెండాపై, కేసీఆర్‌పై నియోజకవర్గ ప్రజలకు అచంచల విశ్వాసం ఉన్నది. 2028లో జగిత్యాల నియోజకవర్గంతోపాటు నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండాను ఎగురవేసి తీరుతాం. జగిత్యాల నియోజకవర్గ ప్రజల్లో ధృడవిశ్వాసం



కల్పించేందుకు ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేయాలి. కార్యకర్తలు, నాయకులు రజతోత్సవ సభకు తరలిరావాలి. అధినేత కేసీఆర్ చెప్పే మాటలు విని ప్రజలకు వివరించాలి. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలి.

**- ఎల్ రమణ, ఎమ్మెల్సీ**

## సైనికుల్లా పనిచేయాలి: కోరుకంటి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీపీసీలో జరిగిన బీఆర్ఎస్ పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి, మాజీ కార్పొరేటర్లు రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్ కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు బుర్ర శంకర్‌గౌడ్, దాసరి ఆనంద్, ధరణి పోషం, రంగు దుర్గాప్రసాద్, మామిడాల రాము, రమాదేవి, సరళ, శాంతక్క ఉన్నారు.







సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, వేదికపై ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీమాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

హాజరైన మహిళలు, నాయకులు, కార్యకర్తలు

# గులాబీ జాతరకు తరలిరండి

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక బీఆర్ఎస్. రాష్ట్ర ప్రజలకు శ్రీరామ రక్షగా ఉండడమే దాని ప్రథమ కర్తవ్యం. బీఆర్ఎస్ రజతోత్సవం అంటే కేవలం గులాబీ జెండా పార్టీది కాదు, తెలంగాణ పండుగ. రజతోత్సవ సభకు ప్రతి ఊరూ కదలాలి. ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలి.

**- కల్వకుంట్ల కవిత**

## ప్రభుత్వంపై పిడికిలి బిగించాలి



కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పిడికిలి బిగించి పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. వరంగల్ బహిరంగ సభ అత్యంత కీలకమైనది. పాతికేళ్ల కాలంలో పార్టీ చేసిన గొప్ప పనులు, సాధించిన విజయాలు, సాధించాల్సిన లక్ష్యాలు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నింటినీ అధినేత కేసీఆర్ వివరిస్తారు. పదేళ్ల అభివృద్ధి పథంలో సాగిన రాష్ట్రం, కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నది. దొంగమాటలతో, తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచిస్తున్నది. పార్టీ శ్రేణులు పార్టీకి పునరంకితం కావాలి. కాంగ్రెస్ తప్పుడు విధానాలపై, హామీలపై పోరాటానికి సిద్ధం కావాలి. కేసీఆర్‌ను సీఎంగా చేసే వరకు విశ్రమించవద్దు. వరంగల్ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉన్నది.

**- కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు**



జగిత్యాలలో వాల్‌రైటింగ్ చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- 27న వరంగల్ సభకు ప్రతి ఊరి నుంచి కదలాలి
- తెలంగాణ ఆత్మగౌరవం బీఆర్ఎస్
- కేసీఆర్ దీక్షతోనే స్వరాష్ట్రం ఏర్పాటు
- కాంగ్రెస్‌ది ఎప్పుడూ మోసపూరిత వైఖరే
- జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


జగిత్యాల, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం అంటే తెలంగాణ పండగ అని, ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ జాతరకు జగిత్యాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. 27న ఉదయం గ్రామగ్రామానా గులాబీ జెండాను ఎగురవేసి వరంగల్ సభకు కదలిరావాలని కోరారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై, దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవం చాటేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పెట్టారని, ఇరవై ఐదేండ్ల కాలంలో కాల పరీక్షకు నిలిచి, తెలంగాణ ప్రజలకు విశ్వ వేదికపై ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని ఉద్ఘాటించారు. పార్టీ తొలి పద్నాలుగేండ్ల కాలంలో ఉద్యమం ద్వారా స్వరాష్ట్రాన్ని సాధిస్తే, తర్వాత పదేళ్ల కాలంలో తెచ్చిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. కేసీఆర్ నేతృత్వంలో ఎక్కడా అమలు కాని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్రంలో అమలు చేసి, ప్రపంచం నివ్వెరపోయేలా చేశారని ప్రశంసించారు. బీఆర్ఎస్ పుట్టక ముందు తెలంగాణ సంస్కృతి, భాష యాసకు గుర్తింపు, గౌరవం లేదని, బీఆర్ఎస్ పెట్టాకే వైభవం ప్రాభవం వచ్చాయన్నారు. 2001లో పుట్టిన పార్టీ అనేక ఒడిదొడుకులను తట్టుకొని నిలబడిందని, సగర్వంగా రజతోత్సవం చేసుకుంటున్నామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని, అలాగే ప్రైవేట్ బస్సులను సైతం హైర్ చేసుకుంటున్నామన్నారు. సభా స్థలికి నిర్దేశిత సమయం కంటే ముందే చేరుకోవాలని, సభలో కేసీఆర్ చెప్పే మాటలు విని, వాటిని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రజలను కాపాడేది బీఆర్ఎస్సే

బీఆర్ఎస్ హయాంలో వరద కాలువ జీవనదిలా ఉండేదని ఇప్పుడు ఎండిపోయి వట్టిపోయి కనిపిస్తున్నదని ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వరద కాలువ నిండుగా ఉంటే సాగుకు, తాగుకు ఇబ్బంది లేకుండా ఉండేదని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం వరద కాలువలో నీరు లేకుండాపోవడంతో ఎగువన ఉన్న కథలాపూర్, మేడిపల్లి, మెట్‌పల్లి, మల్యాల లాంటి మండలాల్లో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు వరద కాలువలో నీరు ఉంటే రైతులు దానికి కరెంట్ మోటర్లు పెట్టుకుంటే ఇబ్బందులు పెట్టవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ పూర్వపు కాంగ్రెస్ పాలన రోజుల వచ్చాయన్నారు. తెలంగాణను, రాష్ట్ర ప్రజలను కాపాడేది బీఆర్ఎస్ పార్టేనని అన్నారు. ఇతర పార్టీలు చెప్పే మాయమాటల గురించి ప్రజలకు వివరించి చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గ్రామ కమిటీలో ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ గ్రామ, పట్టణ కమిటీల్లో యువతకు, మహిళలకు ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాభై శాతం మహిళ రిజర్వేషన్ ఉంటుందని, అలాగే అసెంబ్లీ స్థానాల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు ఉంటాయని, మహిళలను ప్రోత్సహించాల్సిన అసవరం ఉందన్నారు. అనంతరం వరంగల్ సభ కోసం బీడీ కార్మిక మహిళలతో కలిసి మౌనిక ₹5వేలను విరాళంగా అందజేశారు. సమావేశంలో మాజీ మంత్రి రాజేశం గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి రమణ రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వొద్దినేని హరి చరణ్‌రావు, నాయకులు గట్టు సతీశ్, కొండపల్కల రాంమోహన్‌రావు, దావ సురేష్, తురగ శ్రీధర్ రెడ్డి, దేవేందర్ నాయక్, ఆవారి శివ కేసరి బాబు, సమిండ్ల శ్రీనివాస్, వొల్లెం మల్లేశం, మాజీ ప్రజాప్రతినిధులు, అశ్విని, సంధ్య, శీలం ప్రియాంక, మానాల కిషన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి తాండ్ర సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### సంజయ్ ప్రజలను వంచించిండు

బీఆర్ఎస్ నుంచి పోయిన వారు పోతారని, దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. నది ప్రవాహం కొనసాగుతూనే ఉంటుందని, తన ప్రవాహంలో నుంచి తప్పిపోయిన నీటి కోసం నది వెనిక్కి తిరిగి రాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. పాతవారు వెళ్లిపోతే, కొత్తవారు వచ్చిచేరుతూనే ఉంటారని, పోయిన వారు తిరిగి వచ్చినా తీసుకునే ప్రసక్తి లేదన్నారు. 2014లో ఎమ్మెల్యే బీఫాం ఇచ్చి ప్రోత్సహిస్తే డాక్టర్ సంజయ్‌కుమార్ ఓడిపోయారని, అయినా ఆయన వెంట ఉండి 2018, 2023లో గెలిపించామన్నారు. ఆయన గెలుపు కోసం అహర్నిషలు కృషి చేశామన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ ఏర్పాటు, బోర్నపెల్లి వంతెన, హైదరాబాద్ తదుపరి 4,500 డబుల్ బెడ్రూం ఇండ్లను జగిత్యాలకు కేటాయింపజేశామన్నారు. సంజయ్‌కుమార్ జగిత్యాల కోసం ఏ పని అడిగితే ఆ పనిని కేసీఆర్‌కు, కేటీఆర్‌కు చెప్పి మంజూరు ఇప్పించానన్నారు. అంతగా మద్దతు పలికితే పార్టీకి ద్రోహం చేసి, గెలిపించిన ప్రజలను వంచించి పార్టీని వదిలిపెట్టి వెళ్లిపోయాడన్నారు. ఎమ్మెల్యే సంజయన్న మైనార్టీలకు తోఫాను ఊడగొట్టినందుకు పోయాడో.. మరెందుకు పోయాడో తెలియడం లేదన్నారు. పైసల కోసం పోయాడని అందరూ అంటున్నారని విమర్శించారు. ₹136 కోట్లు వెచ్చించి రోళ్లవాగు ప్రాజెక్టు కట్టించామని, కానీ, కాంగ్రెస్ పద్దెనిమిది నెలలుగా దానికి కనీసం షట్టర్ పెట్టలేకపోతున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యేకు ప్రజలపై ప్రేమలేదని, అందుకే పార్టీ మారాడని విమర్శించారు. రాష్ట్రంలో 119 మంది ఎమ్మెల్యేలు ఉంటే, అందులో పనితీరు ప్రకారం చూస్తే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు 108 స్థానం వచ్చిందంటేనే ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన పనితీరు ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. పార్టీ మారినప్పటి నుంచి జగిత్యాల ఎమ్మెల్యే అసెంబ్లీలో కనిపించింది లేదని, మాట్లాడింది లేదని ఆమె ఎద్దేవా చేశారు. ఇటీవల ఒక రోజు టీవీ చూస్తుంటే, అర్వింద్‌తో సంజయన్న కనిపించారని, ఆయన కాంగ్రెస్‌లో చేరాడా..? బీజేపీలో చేరాడో కాసేపు అర్థం కాలేదన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే తెలియడం లేదని, ఆయన కన్‌ఫ్యూజన్‌లో ఉన్నారన్నారు. జగిత్యాలకు నిధులు తేవడంలో ఎమ్మెల్యే సంజయ్ విఫలమయ్యారని, ఆయనను గ్రామగ్రామానా ప్రజలు నిలదీయాలని ఆమె పిలుపునిచ్చారు.



రజతోత్సవ సభ కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రూ. ఐదువేల విరాళం అందజేస్తున్న బీడీ కార్మికులు

### పెద్ద సంఖ్యలో తరలిస్తాం

బీఆర్ఎస్ పండుగే తెలంగాణ పండుగ. రజతోత్సవ సభకు జగిత్యాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిస్తాం. జగిత్యాల నియోజకవర్గంలో అనేక అవమానాలు ఎదురైనా.. కేసీఆర్, కవిత చెప్పారని ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను గెలిపించుకున్నాం. అయితే ఆయన పార్టీకి వెన్నుపోటు పొడవడం బాధాకరం.



ఆయన పార్టీ మారడమే గాక.. పార్టీ కార్యకర్తలు, నాయకులకు పనులు, డబ్బులు ఆశచూపి పార్టీ పిరాయింప చేశాడు. కానీ, కార్యకర్తలు, నాయకుల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని పోగు చేసి పార్టీని కాపాడుకుంటున్నాం. కవితక్క జగిత్యాలలో పాదయాత్ర చేసి, శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలి.

**- దావ వసంత, జడ్పీ మాజీ చైర్‌పర్సన్**

### అన్నం పెట్టిన కేసీఆర్‌ను మరిచిపోం

కేసీఆర్, కవితక్క బీడీ కార్మికుల మంచి చెడ్డలు చూసిన్రు. అడుగక ముందే మా గురించి ఆలోచించిన్రు. నెలకు వెయ్యిరూపాయల జీవన భృతి అందించిన్రు. తర్వాత దాన్ని రెండువేలకు పెంచిన్రు. కేసీఆర్ చూపిన దయతో లక్షలాది మంది బీడీ కార్మికులకు మేలు జరిగింది. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మేం మరిచిపోం. అందుకే బీడీ కార్మికుల పింఛన్‌ను నుంచి ఐదువేల రూపాయలు విరాళంగా ఇస్తున్నం. మళ్లీ త్వరలోనే కేసీఆర్ రాజ్యం రావాలి.

**- మౌనిక, బీడీ కార్మికురాలు, పోచంపేట (సారంగాపూర్)**

# కాంగ్రెస్ పాలనలో రైతులకు నష్టం

- ధాన్యం కొన్న రెండు రోజుల్లోనే డబ్బులు ఖాతాలో వేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కొత్తపల్లి, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, రైతులకు అన్ని రకాలుగా నష్టం చేసిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కొత్తపల్లి మండలంలో మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లా కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన వడ్లను తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో వరి కోతలకు ఇంకా సమయం పడుతుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే సాగునీటిని నిలిపివేయడంతో సుమారు 500 ఎకరాలు నీరందక ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సీజన్లో ఎండిన వరి పంటకు ₹500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరి తడి వరకు నీరిచ్చామని, సమృద్ధిగా నీళ్లు ఉన్నందున సమృద్ధిగా పంటలు పండి ధాన్యం దిగుబడులు అధికంగా వచ్చేవన్నారు. ఒకానొక సందర్భంలో పంట పొలాలకు సాగునీరు వద్దని రైతులు విజ్ఞప్తి చేసిన సందర్భాలు బీఆర్ఎస్ హయాంలో ఉంటే, పంటలకు నీరందక ఎండిపోయిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందన్నారు. కరీంనగర్ ప్రజలకు తాగునీటికి ఇలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మల్కాపూర్‌ను నగరపాలక సంస్థలో విలీనం చేయడం ద్వారా ఉపాధి హామీ కూలీలకు పనిలేకుండా పోయిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అలాగే, రైతుబంధు రాలేదని, సబ్సిడీ గ్యాస్ అందడం లేదని, తులం బంగారం ఇవ్వడం లేదని, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని వివరించారు. అంతకు ముందు కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి వచ్చిన గంగులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, మాజీ జడ్పీ కో అప్షన్ సభ్యులు సాబీర్ పాషా, మాజీ ఎంపీటీసీలు పండుగ గంగమ్మ నర్సన్న, లసుమయ్య, ఉప్పు శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు పాల్గొన్నారు.



కేసీఆర్ పాలనే బాగుండేది అని కాంగ్రెస్ పాలన బాగలేదని గంగులకు చేతులెత్తి దండం పెడుతున్న రైతు ఈరయ్య

### కేసీఆర్ అప్పడే మంచిగున్నది

కాంగ్రెసోళ్ల పింఛన్లు పెంచలేదు. రైతు బంధు ఇయ్యలేదు. రుణమాఫీ చేయలేదు. ఇందిరమ్మ ఇళ్లు ఇయ్యలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరితోపాటు రైతులను మోసం చేసింది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బాగుండే. నాకు రైతు బంధు ఎప్పుడు ఆగలేదు. రుణమాఫీ కూడా అయింది. ఇప్పుడు రైతులకు ఏమీ ఇయ్యడం లేదు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతుల బతుకులు బాగుపడుతయ్.

**- గొల్లపల్లి ఈరయ్య, రైతు, మల్కాపూర్**



మంథనిలో రజతోత్సవ సభపోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# రజతోత్సవ సభతో రాష్ట్రానికి వెలుగు

- 27న గ్రామ గ్రామానా గులాబీ జెండా ఎగరాలి
- సభకు భారీగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 16: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ రాష్ట్రానికి వెలుగునిస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 27 గులాబీ పార్టీ పండుగ రోజని, ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని ఆకాంక్షించారు. మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమవుతున్నదని, హామీల అమలు నుంచి, పాలనా పరమైన నిర్ణయాల వరకు అభాసుపాలవుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ స్పీచ్ కోసం ప్రజలంతా ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారని, ఎప్పటికైనా తెలంగాణకు ఆయన నాయకత్వమే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, పూదరి సత్య నారాయణగౌడ్, ఆరెపల్లి కుమార్, ఎస్కే యాకుబ్, మాచిడి రాజుగౌడ్, పుప్పాల తిరుపతి, పెగడ శ్రీనివాస్, ఆసీఫ్, కొండా రవీందర్ లత పాల్గొన్నారు.